# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 08 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## తిరుమలలో దంపతుల ఆత్మహత్య



**బలగం టీవీ, తిరుమల**

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో విషదం చోటు చేసుకుంది దంపతులు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తిరుపతికి చెందిన శ్రీనివాసులు నాయుడు (58), ఆయన భార్య అరుణ (55) గురువారం తిరుమలకు వచ్చి నందకం అతిథి గృహంలో బస చేశారు. శ్రీవారి దర్శనానంతరం కాటేజీలో ఉన్నట్లు అక్కడ సిబ్బంది తెలిపారు. ఉదయం నుంచి కాటేజీ తలుపులు తెరవకపోవడంతో పోలీసుల సహాయంతో కాటేజీ తలుపులను బద్దలు కొట్టడంతో దంపతులు ఇరువురు, ఫ్యాన్లకు ఉరివేసుకొని విగత జీవులైనారు. శ్రీనివాసులు నాయుడు పుత్తూరులో కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణ చేసినట్లు తెలుస్తోంది. కుటుంబ తగాదాల కారణంగా వీరిరువురు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. టీటీడీ విజిలెన్స్ పోలీసు సిబ్బంది మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టంకు పంపారు. తిరుమల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

# మంత్రి వర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్లే..!



- మార్పులు చేర్పులపై అదిష్ఠానానిదే తుది నిర్ణయం
- నాకు, రాహుల్‌గాంధీకి మధ్య గ్యాప్ లేదు
- కులగణనపై త్వరలో చట్టం
- తొందరపడి ఎవరినీ అరెస్టు చేయం
- కోలిక్కి వచ్చిన పీసీసీ కార్యావర్గం కూర్పు
- ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణ కేబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై అధిష్ఠానానిదే తుది నిర్ణయమని తెలిపారు.ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం అక్కడి మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పలు అంశాలపై మాట్లాడారు.

కుల గణన పక్కాగా చేశామని.. త్వరలో దీనిపై చట్టం కూడా తీసుకొస్తామని సీఎం అన్నారు. తమ సర్వేలో బీసీలు 5 శాతం పెరిగారని తెలిపారు. సూర్యాపేట, గజ్వేల్‌లో సభలు నిర్వహిస్తాం. మంత్రివర్గ విస్తరణపై చర్చలు జరుగుతున్నాయి. తాను ఎవరి పేరు సిఫారసు చేయనని.. అధిష్టానం ఎవరిని నిర్ణయిస్తే వారు మంత్రులవుతారు అని సీఎం రేవంత్ అన్నారు.

"ఏదో ఒక హొటల్లో నలుగురు కూర్చుంటే దాన్ని అసంతృప్తి అని ఎలా అంటారు?. రాహుల్ గాంధీతో నాకు ఎలాంటి గ్యాప్ లేదు ఇదంతా బీఆర్ఎస్ ప్రచారం. అన్ని విషయాలు ఎప్పటికప్పుడు మేము ఫోన్‌లో చర్చించుకుంటున్నాం. మేము నిర్వహించిన కుల గణనపై పార్లమెంటులోని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ప్రచారంపై ఫోకస్ లేదు. ప్రస్తుతం మేము ఇచ్చిన హామీల అమలుపైనే దృష్టి పెట్టాం" అని రేవంత్ చెప్పారు.

"ఈ-ఫార్ములా రేసు స్కామ్‌లో ఆ కంపెనీకి నోటీసులు ఇచ్చాం. ఆ కంపెనీ స్పందించేందుకు సమయం అడిగింది. సమాధానం వచ్చిన తర్వాత తదుపరి కార్యాచరణ ఉంటుంది. తొందరపడి ఎవరిని అరెస్ట్ చేయం. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో జరిగిన అక్రమాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రస్తుతం అడ్వకేట్ జనరల్ పరిశీలనలో ఉంది. ఏజీ ఒపీనియన్ తర్వాత దానిపై ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకుంటాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

పీసీసీ కార్యవర్గం కూర్పు ఓ కొలిక్కి వచ్చిందనీ, ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటిస్తామని అన్నారు. ప్రతిపక్ష నేతల కేసుల విషయంలో చట్ట ప్రకారం ముందుకు వెళతామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని సమస్యలకు తనకు ఉన్న అవకాశం మేరకు శాశ్వత పరిష్కారం దిశగా పని చేస్తున్నానని చెప్పారు.

ఇక మీడియాతో చిట్ చాట్ కంటే ముందు పార్లమెంట్‌లో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. అలాగే రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ పని తీరు గురించి ఖర్గేకు రేవంత్ రెడ్డి వివరించినట్లు తెలుస్తోంది. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఉన్నారు.

తెలంగాణ ముఖ్యనేతలతో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ విడివిడిగా చర్చలు జరిపారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి దీపా దాస్ మున్షీతో చర్చించారు. పీసీసీ కార్యవర్గ కూర్పు, కేబినెట్ విస్తరణపై నేతల అభిప్రాయాలను వేణుగోపాల్ సేకరించారు.

# రెపోరేటు తగ్గింపు

- ఈఎంఐ కట్టేవారికి ఆర్బీఐ బిగ్ రిలీఫ్
- ఐదేళ్లలో తొలిసారి వడ్డీ రేట్లు తగ్గింపు
- 6.4 శాతం వృద్ధి అంచనా
- ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**బలగం టీవి, ముంబై**

ఆర్బీఐ శుభవార్త తెలిపింది. కీలక వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. వడ్డీరేట్లను సవరించడంతో లోన్లు తీసుకున్న వారికి ఉపశమనం కలగనుంది. ఈ మేరకు ఆర్బీఐ ఓ ప్రకటన విడుదల చేసింది. వడ్డీ రేట్లు తగ్గడంతో దేశంలోని కోట్లాది మంది గృహ రుణ కొనుగోలుదారులకు భారీ ఊరట లభించనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు.

రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించినట్లు సంజయ్ మల్హోత్రా తెలిపారు. 6.50 శాతం ఉన్న రెపో రేటును 6.25 శాతానికి తగ్గించామన్నారు. ఆర్‌బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన తొలి సమావేశంలోనే వడ్డీ రేట్లను తగ్గించడం గమనార్హం. గడిచిన ఐదేళ్లలో తొలిసారి రెపో రేటును తగ్గించడంతో సామాన్య ప్రజలకు ఊరట కలిగింది. మే 2023 తర్వాత నుంచి కీలక వడ్డీ రేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచింది. సంజయ్ మల్హోత్రా ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెపో రేటులో సవరణలు చేస్తారని చాలామంది భావించినట్లుగానే ఈ నిర్ణయం తీసుకున్నారు.

### జీడీపీ 6.4 శాతం ఉండొచ్చు



ఆర్బీఐ తాజా ఎంపీసీ భేటీలో రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించినట్టు మీడియాతో గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గనుందన్నారు. చివరి సారిగా కరోనా పరిణామాలతో 2020 మే నెలలో రెపో రేటును 40 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, దేశీయంగా ద్రవ్యోల్బణం ఎగిసిపడటంతో రెండేండ్ల పాటు వడ్డీ రేట్లను క్రమంగా పెంచింది. తాజా తగ్గింపుతో గృహ, వాహన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో భారత జీడీపీ 6.4 శాతంగా ఉండొచ్చని మల్హోత్రా అన్నారు. వచ్చే 2025-26లో 6.7 శాతంగా అంచనా వేశామన్నారు. 2024-25లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.8 శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు. 2025-26లో ద్రవ్యోల్బణం 4.2 శాతానికి తగ్గొచ్చన్నారు. వాణిజ్య బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. బ్యాంక్‌ల వద్ద సరిపడా ద్రవ్య లభ్యత ఉందన్నారు. దేశంలో సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో వీటిని అరికట్టేందుకు ప్రత్యేకంగా బ్యాంక్.ఇన్ డొమైన్‌ను తీసుకురానున్నట్టు గవర్నర్ తెలిపారు.

## మహారాష్ట్రలో అక్రమంగా 39 లక్షల కొత్త ఓటర్లు




- కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ
- స్పందించిన ఎన్నికల కమిషన్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అనేక అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని మార్చడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఐదేళ్లలో 32 లక్షల మంది కొత్త ఓటర్లు చేరారని అన్నారు. లోక్‌సభ- అసెంబ్లీ ఎన్నికలకు మధ్య గ్యాప్ లో 39 లక్షల కొత్త ఓటర్లు చేరారని, ఈ కొత్త ఓటర్లు ఎవరని ప్రశ్నించారు. ఇది హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని మొత్తం ఓటర్ల సంఖ్యతో సమానమని అన్నారు. తమకు లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకు, అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకు తేడా లేదని, కానీ ఎన్డీఏ కూటమి పార్టీలకు అదనంగా ఓట్లు వచ్చి చేరాయని అన్నారు. అదనంగా వచ్చిన ఆ ఓట్లే కూటమి పార్టీలకు (మహాయతి) విజయాన్ని అందించాయని తెలిపారు. కొత్తగా చేరిన ఓటర్ల జాబితా, వారి ఫొటోలు, చిరునామాలు అందించాలని ఎన్నికల కమిషన్‌ను రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఇదంతా ఒకెత్తయితే చాలా చోట్ల దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లను తొలగించారని, పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తినప్పటికీ ఈసీ నుంచి సమాధానం రాలేదని తెలిపారు. ఈ విషయంలో తాము ఎలాంటి ఆరోపణలు చేయడం లేదని.. గణాంకాలు, డేటా ముందు పెట్టి సందేహాలను నివృత్తి చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత కమిషన్ కు ఉందని గుర్తు చేశారు. ప్రతిపక్షాలకు చెందిన పార్టీలన్నీ కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని మహారాష్ట్ర ఓటర్ల

మిగితా 2వ పేజీలో



## మార్చి 7 నుంచి 24 వరకు హెచ్1బి వీసా దరఖాస్తుల స్వీకారం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

అమెరికాలోఉద్యోగాలు చేయబోయే వాళ్లకు మంజూరు చేసే హెచ్1బి వీసాల కోసం దరఖాస్తుల ప్రక్రియ ఈ ఏడాది మార్చి 7న ప్రారంభం కానుంది. మార్చి 7 నుంచి 24 వరకు ఇది కొనసాగుతుందని అమెరికా పౌరసత్వ , వలస సేవల సంస్థ (యుఎస్‌సీఐఎస్) ప్రకటించింది. ఈ సమయంలో పిటిషనర్లు , రెప్రజెంటేటివ్‌లు, రిజిస్ట్రేషన్ కోసం యుఎస్‌సిఐస్ ఆన్‌లైన్ అకౌంట్‌ను వినియోగించుకోవాలని సూచించింది. అభ్యర్థుల ఎంపిక కోసం ప్రతిలబ్ధిదారుడు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని పేర్కొంది. 215 అమెరికా డాలర్లుగా రిజిస్ట్రేషన్ ఫీజు నిర్ణయించారు. ఆర్థిక సంవత్సరం 2026 హెచ్1బికి సంబంధించి ఆర్థిక సంవత్సరం 2025లో ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, అమెరికా ఆర్థిక సంవత్సరం అక్టోబర్ 1న ప్రారంభమవుతుందని వెల్లడించింది. హెచ్1 బి వీసా లబ్ధిదారుల్లో ఎక్కువ మంది భారతీయులే ఉంటారు. వృత్తుల్లో అత్యంత నైపుణ్యం సంపాదించిన భారతీయులే అధిక సంఖ్యలో హెచ్ 1 బీ వీసాలకు ప్రయత్నిస్తుంటారు. ఏటా 65,000 మంది ఈ వీసా కోసం వృత్తి నిపుణులు వీసాలు పొందగా, మరో 20,000 మంది అమెరికాలో ఉన్నత విద్యను పొందుతున్నారు. అమెరికా కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకోడానికి ఈ హెచ్1 బి వీసా లబ్ధిదారులనే ఎంపిక చేస్తుంటారు.

# కొడంగల్‌లో మళ్లీ ఉద్రిక్తత



- ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూ సర్వే చేపట్టిన అధికారులు
- అడ్డుకున్న రోటిబండ గ్రామస్తులు
- భారీగా పోలీసుల పహరింపు

**బలగం టీవి, కొడంగల్**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో మళ్లీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూ సర్వే చేపట్టేందుకు వచ్చిన అధికారులను రోటిబండ తండా రైతులు అడ్డుకున్నారు. ప్లకార్డులు పట్టుకొని భూమి సర్వేను అడ్డుకునే ప్రయత్నం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రోటిబండ తండాలోని రైతులు తమ భూములు ఇవ్వబోమని అధికారులకు ఎదురుతిరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినా తమ భూములు ఇచ్చేది లేదంటూ రైతులు తిరగబడి నిరసన చేపట్టారు. దుద్యాల మండలం రోటిబండ తండాలో పోలీసులు భారీగా మోహరించారు.

.కొడంగల్ నియోజక వర్గంలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండా తండా, పులిచర్లకుంట తండాలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం దాదాపు 1300 ఎకరాల భూమి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు నెలల కిందట ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా.. ఆ రోజు కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులపై రైతులు దాడి చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆ ఘటనలో పలువురు రైతులు జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యారు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళన చేయడంతో ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుపై వెనక్కి తగ్గింది. అనంతరం ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో భూసేకరణ కోసం అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం రోటిబండ తండాలో సర్వే చేసేందుకు రాగా, విషయం తెలుసుకున్న రైతులు వారిని అడ్డుకున్నారు. దాంతో పోలీసులు భారీగా మోహరించి రైతులను సర్వే వైపు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సమయంలో రైతులు, పోలీసుల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయ పొలాన్ని పరిశ్రమల కోసం లాక్కుంటే ఎలా బతకాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. పోలీసుల నిర్బంధంతో సర్వే చేయడంపై రోటిబండ తండా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే సర్వే నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. లేదంటే తమకు ఆత్మహత్య శరణ్యమని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

భూ సేకరణ కోసం అధికారులు సర్వే చేపడుతున్న నేపథ్యంలో ఫార్మా కారిడార్ ఏర్పాటు చేసే గ్రామాల్లో భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. గతంలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టారు. లగచర్ల, రోటిబండతండా గ్రామాల్లో పోలీసుల బందోబస్తు నిర్వహించారు. సర్వేను అడ్డుకునే ప్రయత్నం చేసిన రైతులను పోలీసులు కట్టడి చేశారు.

## కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు

- మీసేవలో దరఖాస్తుకు వెసులుబాటు కల్పించిన సివిల్ సప్లై
- మార్పులు - చేర్పులకు అవకాశం

వివరాలు 2వ పేజీలో



## పాక్ చొరబాటు కుట్ర భగ్నం

- ఏడుగురు పాక్ చొరబాటుదారులు మృతి

**బలగం టీవి, శ్రీనగర్**

నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి కృష్ణ ఘాటి సెక్టార్‌లో పొంచి ఉండి భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్థాన్ విఫలయత్నం చేసింది. భారత్ సైనిక స్థావరంపై దాడి చేసేందుకు పాకిస్థానీలు చేసిన ప్రయత్నాన్ని భారత్ సైన్యం తిప్పికొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు పాక్ చొరబాటుదారులు మరణించారు. వీరిలో ఇద్దరు లేదా ముగ్గురు పాక్ సైనికులని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మిగిలినవారు అల్ బద్ ఉగ్రవాద సంస్థకు చెందినవారై ఉండవచ్చునని తెలుస్తున్నది. ఈ ఘటన జమ్ము కశ్మీరులోని పూంఛ్ జిల్లాలో ఈ నెల 4-5 తేదీల మధ్య రాత్రి జరిగింది. భారత వ్యతిరేక ఎజెం డాతో పాకిస్థాన్ ఏటా కశ్మీరు సంఘీభావ దినాన్ని నిర్వహిస్తూ ఉంటుంది. ఈ సందర్భంగా ఈ దాడికి పాల్పడిందని ఆర్మీ అధికారులు తెలిపారు.



## బాలికపై సామూహిక లైంగికదాడి

- ఐదుగురు అరెస్టు
- రంగారెడ్డి జిల్లా నార్సింగిలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

**బలగం టీవి, రంగారెడ్డి**

బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన సంఘటనలో ఐదుగురు నిందితులను నార్సింగి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. బాలికపై జరిగిన లైంగికదాడి విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్‌షా కోట్‌కు చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. తనతో చదువుతున్న అదే బస్తీకి చెందిన బాలుడు స్నేహితుడు కావడంతో సెప్టెంబర్, 2024న అతడితో కలిసి బయటికి వెళ్లింది. అక్కడికి వచ్చిన అదే బస్తీకి చెందిన ఇంటర్ చదువుతున్న నలుగురు బాలురు, బాలిక స్నేహితుడు కలిసి బాలికపై లైంగికదాడి చేశారు. ఇంటికి వచ్చిన తర్వాత బాలిక విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులు పరారయ్యారు. నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. కేసు నమోదైనప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితులను నార్సింగి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.



## ప్రధాని మోడీ విదేశీ పర్యటన ఖరారు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రధాని నరేంద్ర మోడీ ఫ్రాన్స్, అమెరికా పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఫ్రాన్స్‌లో, 12, 13 తేదీల్లో అమెరికాలో ఆయన పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. పారిస్‌లో జరిగే కృత్రిమ మేధ సదస్సులో పాల్గొనేందుకు ఈ నెల 10వ తేదీన మోదీ ఫ్రాన్స్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. కెడారచీ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను ప్రధాని పరిశీలించనున్నారని మిస్రీ తెలిపారు. అనంతరం 12వ తేదీ సాయంత్రానికి వాషింగ్టన్ డీసీకి చేరుకోనున్న మోడీ.. 13వ తేదీన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అవుతారని సమాచారం. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించనున్నారు.

## ఆర్టీసీ జేఏసీతో చర్చించనున్న కార్మికశాఖ

- 10న చర్చలకు రావాలని నోటీసు
- జేఏసీ నేతలతో పాటు ఆర్టీసీ యాజమాన్యానికి సైతం లేబర్ డిపార్ట్మెంట్ ఆహ్వానం

వివరాలు 2వ పేజీలో

## అమెరికాలో తెలుగు విద్యార్థి ఆత్మహత్య

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



అమెరికాలో తెలుగు విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తుమ్మేటి సాయికుమార్ రెడ్డి అనే విద్యార్థి న్యూయార్క్ లో బలవన్మరణానికి పాల్పడ్డాడు. సాయి ఆత్మహత్యతో అతని మిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. సాయి ఫోన్ లాక్ చేసి ఉండటంతో... కుటుంబ సభ్యులకు ఎలా తెలియజేయాలో తెలియక మీడియాకు సమాచారం అందించారు. సాయికుమార్ రెడ్డి ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్నాడు. అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. పార్ట్ టైమ్ జాబ్ చేసే వారి పరిస్థితి దయనీయంగా మారింది. పార్ట్ టైమ్ జాబ్స్ లేకపోవడం... ఎడ్యుకేషన్ లోన్ చెల్లించాల్సి రావడంతో తెలుగు విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడికి తట్టుకోలేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

## రాజ్యసభలో మూసీ ప్రస్తావన

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**



రాజ్యసభ సమావేశాలలో భాగంగా శుక్రవారం తెలంగాణ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సభలో మూసీ నది ప్రస్తావనను తీసుకొచ్చారు. దేశంలోని ప్రధాన నదుల్లో మూసీ నది ఒకటని.. దీనిని ముచ్ కందా పేరుతో పిలిచేవారని తెలిపారు. మూసీనది వికారాబాద్ అనంతగిరి కొండల్లో మొదలై హైదరాబాద్ నుంచి నల్గొండ, మిర్యాలగూడ వద్ద కృష్ణానదిలో కలుస్తుందని వివరించారు. మూసీ నదికి ఎంతో చరిత్ర ఉందని, హైదరాబాద్ మూసీ నది ఒడ్డున నిర్మించారని చెప్పుకొచ్చారు. ఆ రోజుల్లో మూసీ నది నీరు తాగేవారని.. ఎన్నో ఎకరాలకు నీళ్లు అందించిందని చెప్పారు. నేడు మూసీ నది పరిస్థితి దారుణంగా ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో చెత్త, ఇండస్ట్రీయల్ కెమికల్స్ మూసీ నది వేస్తున్నారని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజలు ప్రతీ సంవత్సరం జబ్బుల బారిన పడుతున్నారని వెల్లడించారు. మూసీ నది ప్రక్షాళన నేపథ్యంలో రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. మూసీ నదికి కేంద్రం నిధులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరుతున్నట్టు వెల్లడించారు. మూసీ నదికి నిధులు కేటాయిస్తే.. ఆ నదికి పునర్జన్మ వచ్చినట్టు అవుతుందని తెలిపారు.

# కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు

- మీసేవలో దరఖాస్తుకు వెసులు బాటు కల్పించిన సివిల్ సప్లై
- మార్పులు - చేర్పులకు అవకాశం




బలగం టీవీ, హైదరాబాద్

కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అలాగే కొత్త రేషన్ కార్డులు మాత్రమే కాకుండా ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో పేరు మార్పులు, చిరునామా మార్పులు, ఇతర మార్పులు అవసరమైనా వాటిని కూడా ఆన్‌లైన్ ద్వారా సులభంగా అప్డేట్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు ప్రభుత్వం మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాలను సందర్శించి అవసరమైన మార్పులు, కొత్త దరఖాస్తులను చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుల జారీ ఎప్పటికీ కొనసాగుతుందని, దీనికి ఒక నిర్దిష్టమైన గడువు లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేస్తూ, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించింది.

# ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్తత

- పరిపాలన భవనాన్ని ముట్టడించిన విద్యార్థులు
- పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్



బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్తత వాతావరణ చోటు చేసుకుంది. విశ్వవిద్యాలయం పరిపాలన భవనాన్ని విద్యార్థులు ముట్టడించారు. మధ్యాహ్నం నుంచి విద్యార్థులు ఆందోళనను కొనసాగిస్తున్నారు.

ఓయూ సైన్స్, నిజాం కాలేజ్, సైఫాబాద్ పీజీ కాలేజ్, సికింద్రాబాద్ కాలేజ్ సైన్సు విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం ఓయూ పరిపాలనా భవన్ వద్దకు తరలివచ్చి భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి జరగనున్న మొదటి మూడవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పలు పరీక్షలు అదే సమయంలో ఉండటంతో పాటుగా సిలబస్ పూర్తిస్థాయిలో పూర్తి కాలేదు కాలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అయితే సదరు కళాశాలల ప్రిన్సిపాల్స్ మాత్రం సిలబస్ పూర్తయిందని అంటున్నారు. కొన్ని వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు కావున పరీక్షలు వాయిదా వేసే అవకాశాలు లేవని ఓయూ అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు రాత్రి అయినా ధర్నాను అలాగే కొనసాగించారు.

# ఆర్టీసీ జేఏసీతో చర్చించనున్న కార్మికశాఖ

బలగం టీవీ, హైదరాబాద్

ఆర్టీసీ జేఏసీని కార్మిక శాఖ చర్చలకు ఆహ్వానించిది. ఈ నెల 10న చర్చలకు రావాలని నోటీసు ఇచ్చింది. జేఏసీ నేతలతో పాటు ఆర్టీసీ యాజమాన్యానికి సైతం లేబర్ డిపార్ట్మెంట్ ఆహ్వానం పలికింది. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెబాట పడుతామని ఇటీవల యాజమాన్యానికి ఆర్టీసీ కార్మికుల జేఏసీ గత నెల 27న సమ్మె నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్పందించిన కార్మిక శాఖ కార్మికులతో పాటు ఆర్టీసీ యాజమాన్యాన్ని చర్చలకు పిలిచింది. 21 డిమాండ్లను యాజమాన్యం ముందుంచింది ఆర్టీసీ జేఏసీ.. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమ్మె నోటీసుల్లో కోరింది. తమ డిమాండ్లకు పరిష్కారం చూపకపోతే ఈ నెల 9వ తేదీన లేదా ఆ తరువాతి మొదటి డ్యూటీ నుంచి సమ్మె మొదలవుతుందని నోటీసుల్లో పేర్కొన్నారు. కానీ, కార్మికులు ఇచ్చిన అల్టిమేటం కంటే తర్వాతి రోజున చర్చలకు రావాలని కార్మిక శాఖ ఆహ్వానించడంతో ఇప్పుడు చర్చనీయాశంగా మారింది. తామిచ్చిన గడువు దాటిన తర్వాత చర్చలకు ఆహ్వానించడంతో జేఏసీ నేతలు చర్చలకు వెళ్తారా లేక సమ్మెబాట పడతారా అనేది ఉత్కంఠగా మారింది.


# బీసీల కోసం మాట్లాడితే షోకాజ్ నోటీసులు ఇస్తారా : తీన్మార్ మల్లన్న

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కులగణనపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వివరణ ఇవ్వాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్‌నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నోటీసులపై తాజాగా ఎమ్మెల్సీ స్పందించారు. 'బీసీల కోసం మాట్లాడితే షోకాజ్ నోటీసులు ఇస్తారా..సర్కార్ క్లియర్‌గా లేదు. నివేదికను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు. కొందరు నేతలు బీసీలను పార్టీకి దూరం చేస్తున్నారు. బీసీలను అణచివేయాలని చూస్తున్నారు. షోకాజ్ నోటీసులపై ఈనెల 12లోగా ఆలోచిస్తా. బీసీ సమాజంతో మాట్లాడి నోటీసులపై సమాధానం ఇస్తా' అని మల్లన్న స్పష్టం చేశారు.

కులగణనపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి.. ఫిబ్రవరి 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ స్పష్టం చేసింది. షోకాజ్ నోటీసులకు స్పందించకపోతే.. కాంగ్రెస్ పార్టీ నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ఆయన నోటీసులపై స్పందించారు. ఇటీవలే వరంగల్ వేదికగా బీసీల సభను నిర్వహించారు. ఇందులో మాట్లాడిన తీన్మార్ మల్లన్న ఓ కులాన్ని ఉద్దేశిస్తూ.. తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా కులగణనను చేపట్టింది. దీనికి సంబంధించి నివేదికను ఇటీవలే విడుదల చేసింది. దీనిపై అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించింది. ఈ నివేదికలో పేర్కొన్న వివరాలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన కామెంట్స్ చేశారు. బీసీలను మోసం చేసేలా కుల గణన లెక్కలు ఉన్నాయని ఆరోపించారు. కుల గణన పూర్తిగా బోగస్ అని విమర్శించారు. ఇది జానారెడ్డి సర్వే అంటూ.. హాట్ కామెంట్స్ చేశారు.

# కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం..

- అమెరికా నుంచి ఆహ్వానం..



బలగం టీవీ, హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. కేటీఆర్‌కు అమెరికా నుంచి ఆహ్వానం అందింది. యూఎస్‌లోని ఇల్లినాయ్‌లోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలో ఏప్రిల్ 19వ తేదీన నిర్వహించనున్న కెల్లాగ్ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ –2025లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించాల్సిందిగా ఆహ్వానం అందింది. ఈ మేరకు కేఐబీసీ వైస్ ప్రెసిడెంట్ చెనాక్షా గోరంట్ల లేఖ పంపించారు. మంత్రిగా పదేళ్ల పాటు కేటీఆర్ అందించిన సేవలను గోరంట్ల ప్రశంసించారు. కేటీఆర్ మీద కేఐబీసీ వైస్ ప్రెసిడెంట్ గోరంట్ల ప్రశంసలు కురిపించారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేసిన కేటీఆర్.. పదేళ్లలో రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ వంటి వినూత్న ఆలోచనలతో తెలంగాణలో సరికొత్త స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందిందన్నారు. ఇది దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందని చెనాక్షా గోరంట్ల గుర్తు చేశారు. ప్రపంచ ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని గోరంట్ల వివరించారు. తెలంగాణ వేదికగా భారత్‌లో పెరిగిన ఈ స్టార్టప్ ఎకో సిస్టమ్ గురించే కాకుండా.. సాంకేతిక రంగంలో వస్తున్న ఈ విప్లవాత్మక మార్పుల గురించి మరింత తెలుసుకోవాలని అమెరికాలోని బిజినెస్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని ఈ లేఖలో గోరంట్ల పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు 43మంది నామినేషన్లు

బలగం టీవీ, హైదరాబాద్

మూడు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి శుక్రవారం మొత్తం 43 మంది నామినేషన్లు వేశారు. మెదక్–నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు శుక్రవారం మొత్తం 30నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో గ్రాడ్యుయేట్ స్థానానికి 28మంది, ఉపాధ్యాయ స్థానానికి ఇద్దరు నామినేషన్లు సమర్పించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లు స్వీకరించారు. శుక్రవారం నాటికి మొత్తం 58 మంది నామినేషన్లు వేశారు. ఇందులో 49 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి, 9 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నామినేషన్లు దాఖలు చేశారు.

కరీంనగర్, మంచిర్యాల, జగిత్యాల, మెదక్, సూర్యాపేట జిల్లాలకు చెందిన పలువురు అభ్యర్థులు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో దయ్యాల ఓం ప్రకాష్, బండారి రాజ్ కుమార్, వి.నరేందర్ రెడ్డి, రాపాల రాజు, న్యాంతాబాద్ జనార్ధన్, చిన్నమైల్ అంజిరెడ్డి, సంకినేని మధుసూదన్ రావు, బక్వాడ బాలాజీ, మెక్కు హేమలత పటేల్, చందా సాయికుమార్, ఎనరెల్లి సాయిబాబా, సర్దార్ రవీందర్ సింగ్, దార మనోహర్, లింగం కృష్ణ, శనిగరపు రమేష్ బాబు, సిహెచ్ పురుషోత్తం, ప్రసన్న హరికృష్ణ, ఎన్.శ్రీనివాస్, జంక్షన్ బక్క, సోమగాని నరేందర్, జావిద్ అహ్మద్, బడే నరసయ్య, అంగ సంపత్ యాదవ్, మహమ్మద్ ముస్తాక్ అలీ, నాచారం చంద్రశేఖర్, మధనం గంగాధర్, దేవునూరు రవీందర్, పెద్దపల్లి సత్యనారాయణ ఉన్నారు.

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి..**

సిద్దిపేట, నిజామాబాద్‌కు చెందిన వంగ మహేందర్‌రెడ్డి, ముత్తారం నరసింహస్వామి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఇదివరకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి యాదగిరి శేఖర్ రావు తరఫున రంగు శ్రీనివాస్, సిలివేరి శ్రీకాంత్, వేముల కరుణాకర్ రెడ్డి, వేముల విక్రం రెడ్డి, అబ్బగోని అశోక్ గౌడ్, రాపాల రాజు, బక్వాడ బాలాజీ, సాయిబాబా మరో సెట్ నామినేషన్ సమర్పించారు. ఉపాధ్యాయ స్థానానికి ఇదివరకే నామినేషన్ వేసిన మల్కా కొమురయ్య తరఫున మల్కా నవీన్, వై.అశోక్ కుమార్, వంగ మహేందర్‌రెడ్డి మరో సెట్ అందజేశారు.

**వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి.. 13 మంది 16 సెట్ల నామినేషన్లు దాఖలు**

వరంగల్– ఖమ్మం– నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లలో భాగంగా శుక్రవారం 13 మంది అభ్యర్థులు 16 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్టు నల్లగొండ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. నామినేషన్లు వేసిన వారిలో బీజేపీ నుంచి పులి సరోత్తమ్‌రెడ్డి ఒక సెట్, 12 మంది స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు. వారిలో ఏలే చంద్రమోహన్, ఎస్.సుందరరాజ్, దామెర బాబురావు, పూల రవీందర్, తలకోల పురుషోత్తంరెడ్డి, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, చాలిక చంద్రశేఖర్, కంటే సాయన్న, జంగిటి కైలాసం, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. పింగిలి శ్రీపాల్ రెండ్లు సెట్లు, అలుగుబెల్లి నర్సిరెడ్డి 3 సెట్ల నామినేషన్ దాఖలు చేశారని కలెక్టర్ వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఉన్నారు.

# తీన్మార్ మల్లన్న గురించి మాట్లాడే టైం లేదు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గురించి మాట్లాడటం వృథా అని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆయన గురించి మాట్లాడేంత సమయం కూడా తనకు లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో, ఆయనపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నకు టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి నోటీసులు పంపించినట్లు తాను వార్తా పత్రికలలో చూసి తెలుసుకున్నానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 56.6 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట..



బలగం టీవీ , గంభీరావుపేట

ఆశేష భక్తుల నడుమ, వేదమంత్రాలతో గంభీరావుపేట మండలం కేంద్రంలో రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నూతనంగా శ్రీ గణపతి ధ్వజయుక్త శ్రీ మహంకాళి అమ్మవారి మూల విరాట్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ గణపతి సహిత ధ్వజయుక్త మహాకాళి దేవి యంత్రమూ ర్తిస్థాపనం, శిఖర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, కళాన్యాసం పూజ, దిక్పాలక బలి. నేత్రోన్మిలనం, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం, ప్రతిష్టమూర్తులకు మహా పూజ హారతి ఆశీర్వచనం నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కేకే మహేందర్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్స హన్మా%శీ%డ్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవాసంక్షేమ సంఘం సభ్యులు, గ్రామ ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## ఆత్మీయ ఆలింగనం చేసుకున్న రాజకీయ ప్రత్యర్థులు..



గంభీరావుపేట మండల కేంద్రంలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది ఎప్పుడు పరస్పర రాజకీయ విమర్శలు చేసుకునే సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి లు ఆప్యాయంగా పలకరించుకొని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు.వారిద్దరూ ఆప్యాయంగా పలకరించుకునే సరికి అక్కడున్న వారంతా ఆశ్చర్యానికి గురయ్యారు

### కన్నుల పండుగగా

# ఒమన్‌లో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణం..





**-పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

బలగం టీవీ ,సిరిసిల్ల

ఒమన్(మస్కట్) దేశంలోని బర్క సిటీ ఒమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణ మహెూత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.. స్వామి వారికి ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు..స్వామివారిని దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణ మహెూత్సవం తొలిసారిగా మస్కట్‌లో జరగడం ఆనందదాయకమని అన్నారు.భక్తుల కోర్కెలు తీర్చే స్వామివారి కృప అందరికీ ఉండాలని, దేశ విదేశాల్లో ఉన్న భక్తులకు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నానని తెలిపారు. సనాతన ధర్మాన్ని, ఆలయ మహెూత్సవాలను ప్రపంచానికి చాటుతున్న ఒమన్ ప్రవాస తెలంగాణవాసుల త్యాగం, భక్తి అభినందనీయం అని అన్నారు. తెలంగాణ గల్ఫ్ కార్మికులు తమ వేదనను మరిచిపోయి, రాష్ట్ర సంస్కృతిని విదేశాల్లో పరిరక్షిస్తూ బ్రహ్మోత్సవాలు, కళ్యాణ మహెూత్సవాలు, పండుగ వేడుకలు నిర్వహించడం గర్వించదగిన విషయం అన్నారు. తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు..



## జ్ఞాన యజ్ఞం కరపత్రాల ఆవిష్కరణ

బలగం టీవీ , తంగళ్లపల్లి

సిరిసిల్ల లోని నెహ్రూనగర్ హనుమాన్ దేవాలయం లో చిన్మయమిషన్ నిర్వహించే జ్ఞానయజ్ఞం కరపత్రంలను అధ్యక్షులు సజ్జనము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నల్ల సత్యనారాయణ, ఆలయ అధ్యక్షులు ఆడెపు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి తాటిపాముల శ్రీనివాస్ లు విడుదల చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు సజ్జనం శ్రీనివాస్ మాట్లాడుతూ సప్తాహ కార్యక్రమంను భక్తులంతా విజయవంతం చేయాలని కోరారు.యజ్ఞానంద స్వామి ఉదయం కేనొపనిషత్ సాయంత్రం భగవద్గీత లపై ప్రవచనాలు చెపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో లకావత్ మోతిలాల్, మేర్గు మల్లేశం, దూడం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.





### సిరిసిల్ల బ్రాండింగ్ కల్పనకు

# ప్రణాళికలు సిద్ధం చేయాలి..



**-డైరీ, టెక్స్ టైల్ రంగాలలో ఎగుమతుల కోసం చిత్తశుద్ధితో కృషి...**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల

డైరీ, టెక్స్ టైల్ రంగాలలో ఎగుమతుల కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జిల్లా స్థాయి ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిస్టిక్ లెవెల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లా నుంచి ఎగుమతి చేసేందుకు వీలుగా అవకాశం ఉన్న 2,3 ఉత్పత్తులను గుర్తించి వాటిని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. నాబార్డ్, ఎం.ఎస్.ఎం.ఈ లు, జాతీయ డైయిరీ డెవలప్మెంట్ బోర్డు తో సమన్వయం చేసుకుంటూ పాల ఉత్పత్తులు, సిరిసిల్ల బ్రాండ్ తో వస్త్రాలు తయారు చేసే ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. వీటికి బ్రాండింగ్ కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, సిరిసిల్ల జిల్లాలో యాక్టివ్ గా ఉన్న ఎఫ్.పి.ఓ లకు ఎక్కువ మార్కెటింగ్ అందేలా చూడాలని అన్నారు. మన దగ్గర ఉన్న వస్త్ర పరిశ్రమ నుంచి ఎగుమతులు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించి నివేదిక అందించాలని అన్నారు.

టెక్స్ టైల్ రంగంలో ప్రపంచంలో ఎక్కడ ఎంత మేర డిమాండ్ ఉంది, ఎటువంటి వస్త్ర ఉత్పత్తులు ఎగుమతి చేయవచ్చు వంటి వివరాలను పరిశీలించాలని, చేనేత కార్మికులతో రెగ్యులర్ గా సమావేశాలు, ట్రైనింగ్ లు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని అన్నారు. మన దగ్గర యూనిక్ సేలింగ్ పాయింట్ ఉండాలని అన్నారు. జిల్లాలో ఉన్న బి.ఎం.సి పూర్తి స్థాయిలో నడిచేలా చూడాలని, దీనికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. పాడి రైతులతో సంప్రదింపులు జరిపి మన దగ్గర పాలు పోసేలా కార్యాచరణ తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కే.వి.ఎస్. శైలజా, పర్సనల్ ప్రైవేట్ సెక్రటరీ, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్స్, కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వి.రవీందర్ రెడ్డి, సాగర్, ఏ.డి. హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్, విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్,లీడ్ బ్యాంకు మేనేజర్ టి.ఎన్.మల్లి ఖార్జున్, టెక్స్టైల్ పార్క్ పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్ దాస్ అనిల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు టి.హనమంతు,ఎం.ఏ. భారతి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యేతో మాకు ప్రాణహాని

**-బాధితులు ఆందోళన.**

బలగం టీవీ , సిరిసిల్ల

మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయంతో ప్రాణహాని ఉన్నదని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బాధితులను నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం పేదల భూములను భూములను అక్రమంగా కబ్జా చేస్తు,ప్రభుత్వ ఉద్యోగాలు ఇపిస్తానంటూ లక్షల్లో డబ్బులు వసూళ్ల చేస్తున్నాడని ఆరోపించారు. ఖాళీ భూమి కనిపిస్తే చాలు, లిటికేషన్ సృష్టించి కబ్జాలు పెడుతున్నారని, 50 సంవత్సరలా నుండి ఉంటున్న ఇండ్లను కూల్చివేస్తాను అంటూ బెదిరింపులకి గురి చేస్తున్నాడని అన్నారు. వ్యాపారవేత్తలవద్ద దగ్గర మెటీరియల్ తీసుకొని డబ్బులు అడుగుతే చంపుతానని బెదిరించాడని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి మాకు న్యాయం చేయాలని అన్నారు.కటకం మృత్యుంజయం పై విచారణ కమిటీ వెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భోజనగారి శంకర్, కొప్పు అమృత, మారవేణి దేవలక్ష్మి, ఐత సంతోష్,మహబూబ్,మెట్టపెల్లి ఆంజనేయులు, రాజు,చిట్టీపల్లి నాంపల్లి,మేకర్తి మల్లేశం మిట్టపెలి బాలరాజు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమకారులు మారవేణి రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

## అక్కినేని జీవిత చరిత్రను ఆవిష్కరించిన ప్రధాని మోడీ

బలగం టీవీ, హైదరాబాద్



ప్రధాని నరేంద్ర మోడీని అక్కినేని ఫ్యామిలీ మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం పార్లమెంట్‌లో కింగ్ నాగార్జున దంపతులు, నాగ చైతన్య దంపతులతోపాటు అక్కినేని కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రధానిని కలిశారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్రను ప్రధాని చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రస్తుతం మోడీని కలిసిన అక్కినేని ఫ్యామిలీ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా, ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోదీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే.


## మార్చి 1న బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

బలగం టీవీ, ముంబై




దేవ్‌జిత్ సైకియా కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత.. ఆయన స్థానంలో కొత్త జాయింట్ సెక్రటరీని నియమించేందుకు బీసీసీఐ మార్చి 1న ముంబైలో ప్రత్యేక సర్వసభ్య సమావేశంను ఏర్పాటు చేసింది. గత నెలలో అసోం క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన సైకియా కార్యదర్శిగా నియమించింది. డిసెంబర్ 1న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌అధ్యక్షుడిగా జై షా బాధ్యతలు స్వీకరించిన విషయం విధితమే. ఎస్‌జీఎం కోసం రాష్ట్ర సంఘాలకు బీసీసీఐ పంపిన నోటీసులో ఏకైక ఎజెండా 'జాయింట్ సెక్రటరీ నియామకం'గా పేర్కొంది. మార్చి 1న మధ్యాహ్నం 12 గంటలకు ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జాయింట్ సెక్రటరీ ఎన్నిక, నియామకం కోసం జరగనుంది ఎంజీఎం జరుగుతుందని బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అభిషేక్ దాల్మియా (తూర్పు జోన్), ఢిల్లీ అండ్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ చీఫ్ రోహన్ జైట్లీ (నార్త్ జోన్), ముంబయి క్రికెట్ అసోసియేషన్ సంజయ్ నాయక్ (వెస్ట్ జోన్) పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. బీసీసీఐ కార్యదర్శి, కోశాధికారి మాదిరిగానే.. బోర్డు కొత్త జాయింట్ సెక్రటరీ కోసం ఎన్నికలు నిర్వహించారు. నిబంధనల ప్రకారం.. ఎస్ఎంజీని పిలవాల్సి ఉంటుంది. బీసీసీఐ గతంలో జనవరి 12న ఎస్‌టీఎంని పిలిచి.. కార్యదర్శిగా సైకియాను.. కోశాధికారిగా ప్రభతేజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంది.






## సోనుసూద్‌కు అరెస్టు వారెంట్ జారీ..

బలగం టీవీ, హైదరాబాద్

ఓ మోసం కేసులో వాంగ్మూలం ఇవ్వడానికి రాకపోవడంతో ప్రముఖ నటుడు సోనుసూద్‌కు పంజాబ్ లుధియానా కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. లుధియానాకు చెందిన న్యాయవాది రాజేష్ ఖాన్న తనకు మోహిత్ శర్మ అనే వ్యక్తి రూ.10 లక్షలు మోసం చేశాడని కోర్టులో కేసు వేశారు. ఈ కేసులో సోనుసూద్‌ను సాక్షిగా పేర్కొన్నారు. అయితే ఎన్నిసార్లు సమన్లు పంపినా అతను కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా అరెస్ట్ వారెంట్ పై సోషల్ మీడియాలో పలు వార్తలు వచ్చాయి. దాంతో సోనూసుద్ స్పందించారు. సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు.

"సోషల్ మీడియాలో నాపై వస్తున్న వార్తల గురించి మీకు క్లారిటీ ఇవ్వాలి. ఈ విషయాన్ని సూటిగా చెప్పాలంటే నాకు ఎటువంటి సంబంధం లేని అంశం విషయంలో కోర్టు నన్ను సాక్షిగా పిలిపించింది. మా లాయర్లు కోర్టుకు సమాధానమిచ్చారు. ఇక దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఫిబ్రవరి 10న వెల్లడి స్తాను. నా ప్రమేయం లేని విషయాల గురించి మీ అందరికీ అప్పు డు స్పష్టంగా వివరిస్తాను. ఆ కేసుకు, నాకు ఎటువంటి సంబంధం లేదు. దీనిపై మీడియా అనవసరంగా దృష్టి సారిస్తోంది. సెలబ్రిటీలను టార్గెట్ చేయడం ఎంతో బాధాకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు.




## 'జాక్' బర్త్‌డే ట్రీట్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'జాక్'. ఈ చిత్రాన్ని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి తాజాగా టీజర్‌ను సిద్ధు బర్త్‌డే సందర్భంగా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో జాక్ పాత్రలో సిద్ధు ఓ దొంగగా కనిపించనున్నాడని ఈ టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక జాక్ చేసే పనులు, చెప్పే మాటలు అందరినీ కన్ఫ్యూజ్ చేయడంతో పాటు కామెడీని పండించే విధంగా ఉన్నాయి. ఈ క్రమంలోనే అతడిని ప్రేమించే హీరోయిన్ పాత్రలో వైష్ణవి చైతన్య క్యూట్‌గా కనిపిస్తున్నది. 'మీ నాన్నకే తెలియనంత గలీజ్ జాబ్ ఏం చేస్తుంటావ్ నువ్వు' అనే హీరోయిన్ ప్రశ్నతో.. హీరో క్యారెక్టర్ ని రివీల్ చేశారు. ఈ సినిమాకు అచు రాజమణి సంగీతం అందించగా బివిఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 10న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

## ఫైనల్‌కు సన్‌రైజర్స్

బలగం టీవీ, హైదరాబాద్

సౌతాఫ్రికా టీ20 లీగ్–2025లోడిఫెండింగ్ ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్ట్రన్‌కేప్ మరో అడుగు ముందుకేసి ఫైనల్ కు దూసుకెళ్లింది. క్వాలిఫయర్–2 మ్యాచ్ లో పార్ల్ రాయల్స్ జట్టును 8 వికెట్ల తేడాతో ఓడించి వరుసగా మూడోసారి ఫైనల్ బెర్త్‌ను కన్ఫామ్ చేసుకుంది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్ రైజర్స్.. కేవలం రెండు వికెట్లే కోల్పోయి 19.2 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించింది. ఓపెనర్ టోనీ డి జోర్జి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. 49 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌ల సాయంతో 78 పరుగులు చేశాడు. జోర్డాన్ హెర్మాన్ 48 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌ల సాయంతో 69 అజేయ పరుగులు చేశాడు. రాయల్స్ బౌలర్లలో మఫాక, దునిత్ వెల్లలాగే తలో వికెట్ తీశారు.

అంతకుముందు బ్యాటింగ్ కు దిగిన పార్ల్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేసింది. రూబిన్ హెర్మాన్ 53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 81 అజేయ పరుగులు చేశాడు. ఓపెనర్ లువాన్–డ్రే ప్రిటోరియస్ (59) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో మార్కో జానెసన్, మార్‌క్రమ్, బార్ట్‌మన్ తలో వికెట్ దక్కించుకున్నారు.

## లైలా ప్రీ రిలీజ్ వేడుకకు చిరంజీవి

బలగం టీవీ, హైదరాబాద్





విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైలా'. ఈ సినిమాకు రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తుండగా.. సాహు గార్లపాటి నిర్మిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకకు చిరంజీవి ముఖ్య అతిథిగా రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ు మెగాస్టార్ ఇంటికి వెళ్లిన నటుడు విశ్వక్‌సేన్, నిర్మాత సాహు గారపాటి చిరంజీవిని కలిసి ప్రీ రిలీజ్ వేడుకకు ఆహ్వానించారు. అనంతరం చిరుకి విశ్వక్ గజమాలతో సన్మానించి హనుమాన్ విగ్రహం బహుకరించాడు. "మా ఆహ్వానాన్ని మన్నించి 'లైలా'కు మద్దతు ఇవ్వడానికి వస్తున్న మెగాస్టార్ చిరంజీవి గారికి ధన్యవాదాలు. సినిమాకు మీరు ఎల్లప్పుడూ బేషరతుగా మద్దతు ఇస్తున్నందుకు చాలా కృతజ్ఞతలు" అని విష్వక్సేన్ తన్ ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు.

## జాతీయ క్రీడల్లో తెలంగాణకు పతకాలు..

బలగం టీవీ, హైదరాబాద్



ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అథ్లెట్లు మంచి ప్రదర్శన చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ క్రీడల్లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ఖాతాల్లో మరిన్ని పతకాలు వచ్చి చేరాయి. బాక్సింగ్ 91 ప్లస్ కిలోల విభాగంలో తెలంగాణకు చెందిన బాక్సర్ అబ్దుల్ జావేద్ కాంస్యం పతకాన్ని గెలుచుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ బీచ్ వాలీబాల్ టీమ్ గోల్డ్ మెడల్ ను సొంతం చేసుకుంది.ఈ తుది పోరులో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన కె.మణికంఠరాజు, ఎల్.దివ్యసాయి ద్వయం.. 25–23, 21–19 తేడాతో తమిళనాడు జోడీపై విజయాన్ని అందుకుంది. తద్వారా పసిడి పతకాన్ని ముద్దాడింది.

ఇక ఆర్చరీ విభాగంలో సీనియర్ దీపిక కుమారి, 18 ఏళ్ల జుయెల్ సర్కార్ విజయం సాధించారు. మహిళల రికర్వ్ సింగిల్స్ ఫైనల్ లో దీపిక 6–4 తేడాతో అంకిత (బిహార్)పై పోరాడి గెలిచింది. అయితే పురుషుల రికర్వ్ సింగిల్స్‌లో స్టార్ ఆర్చర్ తరుణ్ దీప్ రాయ్‌కు మాత్రం నిరాశే ఎదురైంది. సెమీ ఫైనల్లో తరుణ్ 2–6 తేడాతో 18 ఏళ్ల జుయెల్‌పై పరాజయం పొందాడు. అయినప్పటికీ అతడు బ్రాంజ్ మెడల్ ను సంపాదించుకున్నాడు. కంచు పోరులో ఇంద్ర చంద్‌ను తరుణ్ దీప్ 6–4 తేడాతో ఓడించి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఇక రికర్వ్ టీమ్ విభాగంలో ఝార్ఖండ్ జట్టు విజేతగా నిలిచింది. దీపిక, అంకిత భాకత్, కోమలిక, తమన్నాతో కూడిన మహిళల జట్టు 0–6 తేడాతో మహారాష్ట్ర జట్టును ఓడించింది.

## మొదటిసారి నీ ముఖం దర్శనం అవుతుంది సామీ"



బలగం టీవీ, హైదరాబాద్

అక్కినేని నాగచైతన్య, చందు మొండేటి కాంబినేషన్‌లో తెరకెక్కిన తండేల్ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ మూవీ రిలీజ్ సందర్భంగా నాగచైతన్య భార్య శోభిత ధూళిపాళ్ల చిత్ర బృందానికి విషెస్ చెబుతూ ఇన్‌స్టా వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. ఈ సినిమాపై చైతూ చాలా దృష్టి సారించారని, చేస్తున్నన్ని రోజులు పాజిటివ్‌గా ఉన్నారని పేర్కొన్నారు. "ఫైనల్లీ గడ్డం షేవ్ చేస్తావు. మొదటిసారి నీ ముఖం దర్శనం అవుతుంది సామీ" అంటూ చైతూను ఉద్దేశిస్తూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. ఈ మూవీ కోసం చాలా రోజులుగా ఆయన గడ్డం లుక్‌లోనే ఉన్న విషయం తెలిసిందే.

ఇక భార్య తనను ఉద్దేశించి చేసిన పోస్టుపై నాగచైతన్య స్పందించారు. "థ్యాంక్యూ మై బుజ్జి తల్లి" అని రిప్లై ఇచ్చారు. దీంతో ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.